ప్రయాణం.. ప్రమాదకరం

జిల్లా కేంద్రం పుట్టపర్తిలో రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. కంకర తేలి గుంతలు పడిన రోడ్లపై రాకపోకలు ఇబ్బందికరంగా మారాయి. నడవడానికి సైతం వీలుకాని పరిస్థితి. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు నిత్యం ఈ రోడ్లపైనే పయనిస్తుంటారు. కానీ రోడ్లను బాగుచేసేందుకు ఎటువంటి చర్యలూ తీసుకోకపోవడం గమనార్హం.

- ఆధ్యాత్మిక కేంద్రం పుట్టపర్తిలో రోడ్లు అధ్వానం
- గుంతలమయమైన వెస్ట్‌గేట్, బ్రాహ్మణపల్లి రోడ్లు
- సత్యసాయి జయంతి వేళ భక్తులకు ఇబ్బందులు తప్పవా?


వెస్ట్‌గేట్ రోడ్డుపై ఏర్పడిన గుంతల్లోకి చేరిన నీరు


బ్రాహ్మణపల్లి వద్ద దెబ్బతిన్న రోడ్డు

ప్రశాంతి నిలయం: ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రంగా పుట్టపర్తి బాసిల్లుతోంది. దేశవిదేశాల నుంచి సత్యసాయి భక్తులు ఇక్కడికి విచ్చేస్తుంటారు. జిల్లా కేంద్రం కూడా కావడంతో ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులందరూ ఇక్కడే ఉండి కార్యకలాపాలు నిర్వహిస్తుంటారు. అంతేకాదు అత్యున్నత వైద్య సేవలందించే శ్రీసత్యసాయి సూపర్ స్పెషాలిటీ కూడా ఇక్కడే ఉంది. దేశ నలుమూలల నుంచి కూడా పలువురు వైద్యం కోసం ఇక్కడకు విచ్చేస్తుంటారు. అలాంటి చోట సరైన రోడ్లు లేకపోవడం ప్రజలకు ఇబ్బందికరంగా ఉంది. ప్రశాంతి నిలయం, పుట్టపర్తి, కమ్మవారిపల్లికి చెందిన వాహనదారులు వెస్ట్‌గేట్ మీదుగా ప్రశాంతి గ్రామ్ వైపు ప్రయాణిస్తుంటారు. 'సత్యసాయి దీనజనోద్ధరణ' భవనాలలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ కార్యాలయాలకు సైతం ఉద్యోగులు ఇదే రోడ్డుపై వెళ్తారు. ప్రశాంతి నిలయంలో నివాసముండే సత్యసాయి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి సిబ్బంది ఇదే మార్గంలో రాకపోకలు సాగిస్తారు. వెస్ట్‌గేట్ రోడ్డు రెడ్డికుంట వద్ద నుంచి సుమారు 500 మీటర్ల మేర రోడ్డు పూర్తిగా దెబ్బతింది. రెండు అడుగుల మేర గుంతలు ఏర్పడడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షం కురిస్తే ఈ రోడ్డు ఇంకుడుగుంతలను తలపిస్తుంటాయి. రాత్రి వేళ ఈ మార్గంలో వాహనాల్లో ప్రయాణించాలంటే ఎక్కడ ప్రమాదానికి గురవుతామోనని పలువురు ఆందోళన చెందుతున్నారు.

త్వరలోనే బాబా జయంత్యుత్సవాలు

నవంబర్‌లో సత్యసాయి జయంత్యుత్సవాలు పుట్టపర్తిలో ఘనంగా జరగనున్నాయి. దేశ విదేశాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలిరానున్నారు. వివిధ రాష్ట్రాల రాజకీయ ప్రముఖులు, ఉన్నతాధికారులు సైతం వేడుకలకు హాజరుకానున్నారు. ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా వీఐపీలను సత్యసాయి విమానాశ్రయం నుంచి వెస్ట్‌గేట్ రోడ్డు మీదుగా ప్రశాంతి నిలయానికి తీసుకెళ్లాల్సి ఉంటుంది. ఆ సమయానికి రోడ్డు బాగు చేయకుంటే ఇబ్బందులు తప్పవు.

బ్రాహ్మణపల్లి రోడ్డుకు మోక్షమెప్పుడో?

మున్సిపాలిటీలోని బ్రాహ్మణపల్లి, తండా, బీడుపల్లి, బడేనాయక్ తండా, గోనేనాయక్ తండా వాసులు పుట్టపర్తికి వెళ్లాలంటే ప్రశాంతి గ్రామ్ నుంచి ఎనుములపల్లి వరకు గల రోడ్డుపై ప్రయాణించాలి. అయితే బ్రాహ్మణపల్లి సచివాలయం వద్ద నుంచి బాబా లర్నింగ్ సెంటర్ మలుపు వరకు రోడ్డు మొత్తం గుంతలు పడింది. ఈ రోడ్డుపై నడవడానికీ కష్టంగానే ఉంటోంది. ఇక రాత్రివేళ అయితే ఎక్కడ గుంతలు ఉన్నాయో తెలియక ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో గ్రామస్తులు కలెక్టర్‌ను కలిసి సమస్యను వివరించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రయాణించాలంటే భయమేస్తోంది



బ్రాహ్మణపల్లి వద్ద రోడ్డు పూర్తిగా దెబ్బతింది. గుంతలు పడిన రోడ్డులో వాహనాలు నడపాలంటే భయమేస్తోంది. రాత్రి పూట ప్రయాణించాలంటే ఎక్కడ ప్రమాదం జరుగుతుందోనని బెంబేలెత్తాల్సిందే. ఉన్నతాధికారులు స్పందించి రోడ్డు రిపేరీ చేయాలి.

–రామమోహన్‌రెడ్డి, బ్రాహ్మణపల్లి

వెస్ట్‌గేట్ రోడ్డు మరమ్మతు చేయాలి



త్వరలో భగవాన్ సత్యసాయిబాబా జయంతి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఆలోపు పుట్టపర్తిలోని వెస్ట్‌గేట్ రోడ్డు మరమ్మతు పూర్తి చేయాలి. లేకుంటే వేడుకల్లో పాల్గొనేందుకు వచ్చే వీఐపీలు, భక్తులు ఈ మార్గం గుండా ప్రయాణించడానికి తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుంది.

– మాతంగి తిప్పన్న, మున్సిపల్ వైస్ చైర్మన్, పుట్టపర్తి

క్లుప్తంగా

యువత చేతుల్లోనే దేశ భవిష్యత్తు


పరీక్షను పర్యవేక్షిస్తున్న లక్ష్మయ్య, ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రెడ్డి

ధర్మవరం అర్బన్: యువత చేతుల్లోనే దేశ భవిష్యత్తు ఆధారపడి ఉందని లక్ష్మయ్య ఐఏఎస్ అకాడమీ అధినేత లక్ష్మయ్య, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని గుట్టకిందపల్లిలోనున్న కేహెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆదివారం ఢిల్లీ ఐఏఎస్ లక్ష్మయ్య అకాడమీ, సంస్కృతి స్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్తంగా సివిల్స్ కోచింగ్‌పై మహిళలకు శిక్షణ ఇప్పించేందుకు అర్హత పరీక్షను నిర్వహించారు. ఈసందర్భంగా 120 మంది మహిళలు అర్హత పరీక్ష రాయగా 25 మంది ఎంపికయ్యారు. ఎంపికైన వారికి ఢిల్లీలో సివిల్ సర్వీస్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు వారు తెలిపారు. యువత అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరం

ధర్మవరం అర్బన్: పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. బెంగళూరు శంకర్ కంటి ఆసుపత్రి వైద్యులు 84 మంది కంటి పరీక్షలు చేయగా 63 మంది కంటి ఆపరేషన్లు అవసరమున్నట్లుగా గుర్తించారని రోటరీక్లబ్ అధ్యక్షుడు జయసింహ, ఉపాధ్యక్షుడు నరేంద్రరెడ్డి, కార్యదర్శి నాగభూషణ, కోశాధికారి సుదర్శన్‌గుప్తలు తెలిపారు. అనంతరం దాతలతో పాటు వైద్యులను రోటరీక్లబ్ సభ్యులు సన్మానించారు. మెంటల్లీ చాలెంజ్‌డ్ పిల్లలకు ఫిజికల్, మెంటల్ డెవలప్‌మెంట్ కోసం రూ.6వేలు విలువ చేసే కిట్లను అందించారు. క్యాంపు చైర్మన్ శ్రీనివాసరెడ్డి, సాంస్కృతిక మండలి వ్యవస్థాపకుడు సత్రసాల ప్రసన్నకుమార్, రోటరీక్లబ్ సభ్యులు సోలిగాళ్ల వెంకటేషులు, రమేష్‌బాబు, కృష్ణమూర్తి, వెంకటాచలం, మనోహర్‌గుప్త, శివయ్య, రామకృష్ణ, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం


మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్

ముదిగుబ్బ: ధర్మవరం నియోజకవర్గ అభివృద్ధే తన లక్ష్యమని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన హిందూపురం ఎంపీ బీకే పార్థసారథితో కలిసి మండలవ్యాప్తంగా రూ.3 కోట్లతో పలు అభివృద్ధి పనులకు భూమిపూజ నిర్వహించారు. అనంతరం మండలకేంద్రంలో బీజేపీ కార్యాలయాన్ని ప్రారంభిచారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గాన్ని అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో టీడీపీ ధర్మవరం ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్, జనసేన ఇన్‌చార్జ్ చిలకం మధుసూధన్‌రెడ్డి, బీజేపీఅనంతపురం జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులు, ఎంపీపీ ఆదినారాయణ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

సీసీరోడ్ల నిర్మాణానికి భూమిపూజ


ఎమ్మెల్యే పక్కన కూర్చున్న టీడీపీ మండల కన్వీనర్ చెన్నకేశవులు(వృత్తంలో)

కదిరి అర్బన్: పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా పట్నం గ్రామంలో సీసీరోడ్ల నిర్మాణాలకు ఆదివారం ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ భూమిపూజ చేశారు. మొత్తం 11 పనులకుగాను రూ.29.80 లక్షలు మంజూరైనట్లు అధికారులు తెలిపారు. వేదికపై తెలుగుదేశం పార్టీ మండల కన్వీనర్ చెన్నకేశవులు కూర్చోవడంతో ఇది ప్రభుత్వ కార్యక్రమమా లేక పార్టీ కార్యక్రమమా అని పలువురు విస్మయం వ్యక్తం చేశారు.

తలుపుల : గెరికపల్లిలో పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా ఆదివారం రూ. 15 లక్షలతో సీసీరోడ్డుకు ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ భూమి పూజ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోందన్నారు. ఎంపీడీఓ రామానాయక్, తహసీల్దార్ రెడ్డి శేఖర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కోడి పందెం రాయుళ్ల అరెస్ట్

తనకల్లు: అగ్రహారం గ్రామ శివారులో కోడి పందెం ఆడుతున్న ఇద్దరు వ్యక్తులను ఆదివారం పోలీసులు అరెస్ట్ చేశారు. ముందస్తు సమాచారం మేరకు పోలీసులు దాడులు నిర్వహించారు. ఈసందర్భంగా కోడి పందెం ఆడుతున్న ఇద్దరిని అరెస్ట్ చేసి వారి నుంచి రూ.1,850 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గోపి తెలిపారు.

కురుబ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మృతి


నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు


మాధవప్ప(ఫైల్)

పుట్టపర్తి అర్బన్: కురుబ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్, వైఎస్సార్‌సీపీ నేత పైపల్లికి చెందిన కురుబ మాధవప్ప(70) ఆదివారం గుండె పోటుతో మృతి చెందారు. పైపల్లి సర్పంచ్‌గా, పెడపల్లి సొసైటీ డైరెక్టర్‌గా పని చేశారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి తండ్రి వెంకటరామిరెడ్డి, ఎంపీపీ ఏవీ రమణారెడ్డి, మండల కన్వీనర్ నరసారెడ్డి, మేన్సిపల వైస్ చైర్మన్ తిప్పన్న, సర్పంచ్ ప్రవీణ్, మాజీ సర్పంచ్ చిత్తరంజన్‌రెడ్డి, మండల అగ్రిబోర్డు మాజీ చైర్మన్ సూర్యనారాయణరెడ్డి, శ్రీరాంనాయక్, మురారి, మురళీ, నాయకులు గంగాద్రి, మల్లిరెడ్డి తదితరులు గ్రామానికి వెళ్లి నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి మాధవప్ప కుటుంబ సభ్యులను ఫోన్‌లో పరామర్శించారు. సోమవారం ఉదయం 9.30 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఆయన భార్య ఈశ్వరమ్మ, కుమారుడు ధనుంజయ తెలిపారు.

అమడగూరులో భారీ వర్షం

అమడగూరు: మండల వ్యాప్తంగా ఆదివారం రాత్రి భారీ వర్షం కురిసింది. సాయంత్రం నుంచి ఉరుములు, మెరుపులతో కూడిన వర్షానికి పలు చెరువుల్లోకి ఎక్కువగా నీరు వచ్చి చేరింది. పేరంవాండ్లపల్లి, బాలప్పగారిపల్లి చెరువులు మరువ పారుతుండగా ఏ కొత్తపల్లి చెరువు 24 గంటల్లోగా మరువ పారే అవకాశం ఉన్నట్లు గ్రామస్తులు పేర్కొన్నారు. పూలకుంటపల్లి సమీపంలో అమడగూరు–కొక్కంటిక్రాస్ రోడ్డులో ఉన్న బచ్చలవాండ్లపల్లి ఏరు భారీగా ప్రవహించడంతో ప్రయాణికులు తీవ్ర అగచాట్లు పడ్డారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ వెంకటనారాయణ అక్కడకు చేరుకుని ప్రయాణికులను దారి మళ్లించారు.

భక్తిశ్రద్ధలతో గ్యార్మీ వేడుకలు


జెండామాను వద్ద ప్రార్థనలు చేస్తున్న పూల శ్రీనివాసులురెడ్డి

తలుపుల : మండలంలోని నూతనకాల్వ గ్రామంలో ఆదివారం గ్యార్మీ వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అబ్దుల్ ఆధ్వర్యంలో నడివీధిలోని జెండామాను వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వైఎస్సార్‌సీపీ సీఈసీ సభ్యుడు పూల శ్రీనివాసులురెడ్డి ప్రత్యేక ప్రార్థనలకు హాజరయ్యారు. ఈ ప్రాంతమంతా సుభిక్షంగా ఉండాలని ఆయన కోరుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు షేక్షావలి, కొండారెడ్డి, మనోహర్‌నాయుడు, మాజీ ఎంపీటీసీ మల్లినాయుడు, మైనార్టీ నాయకులు రఫీ, అలీ, అర్పుల్లా, రసూల్, జిలాన్ పాల్గొన్నారు.

నల్లచెరువు: సర్పంచుల సంఘం మండలాధ్యక్షుడు శ్రీనాథ్‌రెడ్డి సోదరుడు దాసరి విశ్వనాథ్‌రెడ్డి(39) ఈ నెల 10న బొమ్మిరెడ్డి గ్రామంలో పాము కాటుకుగురై మృతి చెందిన విషయం తెలిసిందే. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సీఈసీ సభ్యుడు పూల శ్రీనివాస రెడ్డి ఆదివారం గ్రామానికి విచ్చేసి విశ్వనాథ్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, రైతువిభాగం జిల్లా నేత శ్రీధర్‌రెడ్డి, నాయకులు శ్రీకంఠరెడ్డి, రమణారెడ్డి, అలీ, మధు, పూల ప్రకాష్‌రెడ్డి, సిద్దార్థరెడ్డి తదితరులు ఉన్నారు.

ఘనంగా సత్యసాయిబాబా అవతార దినోత్సవం


ధర్మవరంలో సత్యసాయి సేవా సమితి సభ్యుల ర్యాలీ


సత్యనారాయణ వ్రతం నిర్వహిస్తున్న దృశ్యం

దర్మవరం అర్బన్: పట్టణంలో ఆదివారం సత్యసాయి బాబా అవతార ప్రకటన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా సత్యసాయి సేవా సమితి సభ్యులు, బాల వికాస్ జిల్లా ఇన్‌చార్జ్ ఆదిలక్ష్మి, గ్రామ సేవా ఇన్‌చార్జ్ శేషాచారి, సమితి సభ్యులు విద్యార్థులతో కలిసి బాబా చిత్రపటాలను పురవీధుల్లో ఊరేగించారు.

కదిరి టౌన్: సత్యసాయి బాబా అవతార ప్రకటన దినోత్సవాన్ని సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా స్థానిక కృష్ణ మందిరంలో 154 జంటలు సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం చేపట్టారు. మధ్యాహ్నం నారాయణ సేవ నిర్వహించారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా సమితి శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షుడు కె.సత్యనారాయణ మూర్తి, సేవాదళ్ రాష్ట్ర జాయింట్ కోఆర్డినేటర్ సి.విశ్వనాథ్ రెడ్డి, శ్రీసత్యసాయి సేవా సమితి సభ్యులు, భజన మండలి కన్వీనర్లు, ఇంచార్జులు పాల్గొన్నారు.

వర్షం.. మిగిల్చింది నష్టం

- పొలాల్లోనే కుళ్లుతున్న వేరుశనగ, పత్తి
- దెబ్బతిన్న ఆముదం, కంది, కాయగూరల పంటలు


కనగానపల్లి మండలంలో పొలాల్లోనే వర్షానికి కుళ్లిపోతున్న వేరుశనగ పంట

కనగానపల్లి: ఇటీవల వరుసగా కురిసిన వర్షాలు రైతన్నలకు నష్టాలు మిగిల్చాయి. ఆరుగాలం శ్రమించి సాగు చేసిన పంటలు తుపానుకు దెబ్బతిన్నాయి. పంటలు చేతికి వచ్చే సమయంలో పాడైపోవడంతో రైతుల కష్టమంతా నీరుగారిపోయింది. ఈ వర్షాలతో రాప్తాడు నియోజకవర్గంలో సుమారు 15 వేల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నట్లు సమచారం. ముఖ్యంగా ఖరీఫ్‌లో సాగుచేసి కోత దశలో ఉన్న వేరుశనగ, పత్తి, ఆముదం, కంది పంటలు చాలా దెబ్బతిన్నట్లు రైతులు చెబుతున్నారు.

56 వేల ఎకరాల్లో వేరుశనగ సాగు..

నియోజకవర్గంలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో సుమారు 56 వేల ఎకరాల్లో వేరుశనగ సాగు చేశారు. చాలా చోట్ల పంట కాలం పూర్తి కావడంతో కోతలు ప్రారంభించారు. ఈ సమయంలో తుపాన్ ప్రభావంతో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురిశాయి. తొలగించిన వేరుశనగ పొలాల్లోనే కుళ్లిపోతోంది. వేరుశనగ కాయలతో పాటు పశుగ్రాసం కూడా దక్కే పరిస్థితి లేదని ఆత్మకూరు, కనగానపల్లి, రామగిరి మండలాల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంకా పంట తొలగించని చోట చెట్లలోనే కాయలు మొలకలు పోతున్నాయి. తుపాన్‌తో నియోజకవర్గ వ్యాప్తంగా 6 వేల ఎకరాలకు పైగా వేరుశనగ పంట దెబ్బతిన్నట్లు వ్యవసాయాధికారులు తెలిపారు. పంట నష్టాన్ని అంచనా వేసేందుకు వ్యవసాయ శాఖ అధికారులు ఇంకా పొలాల్లో పర్యటించలేదని రైతులు చెబుతున్నారు.

కాయగూరల పంటలు వర్షార్పణం

వేరుశనగ, కంది, పత్తి, ఆముదంతో పాటు బోరుబావుల కింద కాయగూరల పంటలు కూడా ఎక్కువగా సాగు చేశారు. ప్రస్తుతం కంది, పత్తి, ఆముదం పంటలు కూడా మొగ్గ దశలో ఉన్నాయి. విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో కందిలో పూత, ఆముదం, పత్తి పంటలో కాయలు రాలిపోతున్నాయి. నియోజకవర్గం వ్యాప్తంగా ఏటా సుమారుగా 15 వేల ఎకరాల్లో కంది పంట సాగవుతుంది. ఇందులో పూత, కాయదశలో ఉన్న 8 వేల ఎకరాల దాకా పంట దెబ్బతిన్నట్లు కనగానపల్లి, రాప్తాడు, చెన్నేకొత్తపల్లి, ఆత్మకూరు మండలాల రైతులు తెలిపారు. ఇక వీటితో పాటు కనగానపల్లి మండలం పర్వతదేవరపల్లిలో 200 ఎకరాల్లో సాగు చేసిన పత్తి పంట వర్షాలకు దెబ్బతింది. వేపకుంట, తూంచర్ల, భానుకోట గ్రామాల్లో సాగు చేసిన ఆముదం పంట కూడా తుపాన్‌తో దెబ్బతింది. బోరుబావుల కింద సాగు చేసిన టమాట, బెండ, మిరప తదితర కాయగూరల పంటలు వర్షార్పణం అయ్యాయి.

పత్తి కాయలు రాలిపోతున్నాయి..



ఖరీఫ్‌లో మెట్ట భూముల్లో పత్తి సాగు చేశా. ప్రస్తుతం పూత, మొగ్గ దశకు చేరుకుంది. తుపాను ప్రభావంతో విస్తారంగా వర్షాలు కురవడంతో పత్తి కాయలు బూజుపట్టి రాలిపోతున్నాయి. గ్రామంలో సుమారు 150 ఎకరాల దాకా పత్తి పంటలు దెబ్బతిన్నాయి. రైతులను ఆదుకోవాలి. – శ్రీనివాసులు రెడ్డి, రైతు, పర్వతదేవరపల్లి, కనగానపల్లి మండలం

పొలాల్లోనే వేరుశనగ

నేను 10 ఎకరాల్లో వేరుశనగ పంట సాగు చేశాను. పంట కాలం పూర్తి కావడంతో వారం రోజుల క్రితం పంట తొలగించాను. వేరుశనగ తొలగించిన తర్వాత వరుసగా వర్షాలు కురిశాయి. వేరుశనగ కట్టెంతా పొలంలోనే తడిచిపోయింది. ఆరు రోజుల తర్వాత పొలంలోనే పంట నూర్పిడి చేసుకోవాల్సి వచ్చింది. వర్షానికి పంట తడవడంతో కాయలతో పాటు పశుగ్రాసం కూడా దెబ్బతింది. ఆర్థికంగా చాలా నష్టపోయాను. ప్రభుత్వం రైతులను ఆదుకోవాలి.

– గోపాల్‌రెడ్డి, రైతు, ఆత్మకూరు

రిహార్సల్స్ పరిశీలన

పుట్టపర్తి టౌన్: పోలీస్ కార్యాలయంలో ఆదివారం జరిగిన అమరవీరుల సంస్మరణ దనోత్సవ రిహార్సల్స్‌ను అడిషనల్ ఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, ఏఆర్ డీఎస్పీ విజయకుమార్ పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్ఐలు వలి, చంద్రశేఖర్, రవితో పాటు ఏఆర్ సిబ్బంది పాల్గొన్నారు. కాగా సోమవారం అమరవీరుల సంస్మరణ దినోత్సవ నిర్వహణకు అధికారులు ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

చేయి చేయి కలిపి.. చెరువుకు నీరు మళ్లించి..


ఇసుక బస్తాలను అడ్డువేస్తున్న అప్పరాచెరువు గ్రామస్తులు

బత్తలపల్లి: గ్రామస్తులు చేయి..చేయి కలిపారు. చెరువు నుంచి వృథాగా చిత్రావతి నదికి వెలుతున్న నీటికి అడ్డుకట్ట వేసి రైతుల ఐక్యతతో అప్పరాచెరువుకు నీటిని మళ్లించుకున్నారు. మండలంలోని అతిపెద్ద చెరువు అయిన అప్పరాచెరువును వర్షపు నీటితో నింపుకోవడానికి పార్టీలకతీతంగా గ్రామానికి చెందిన నాయకులతో పాటు గ్రామస్తులు చేయి చేయి కలిపి గోట్లూరు చెరువు నుంచి చిత్రావతి నదికి వృథాగా వెలుతున్న వర్షపు నీటిని అప్పరాచెరువుకు మళ్లించుకున్నారు. రామగిరి, కనగానపల్లి తదితర ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు గోట్లూరు చెరువు నించి మరువ పారుతోంది. మరువ నీరు అంతా చిత్రావతి నదిలోకి వెళ్తోంది. ఇది గమనించిన అప్పరాచెరువు గ్రామస్తులు వృథాగా వెళ్తున్న నీటికి ఇసుక బస్తాలు అడ్డగించి అప్పరాచెరువుకు మళ్లించారు. అప్పరాచెరువు నిండితే సమీపంలోని దాదాపు పది గ్రామాల్లో భూగర్భజలాలు పెరుగుతాయని రైతులు అంటున్నారు.

ప్రజల అవస్థలు పట్టవా?

- శిథిలావస్థలోని తహసీల్దార్ కార్యాలయ భవనం
- పెచ్చులూడుతోందని భవనాన్ని ఖాళీ చేసిన అధికారులు
- కి.మీ దూరంలోని భవనంలోకి మార్పు
- రాకపోకలకు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్న ప్రజలు


శిథిలావస్థలో తహసీల్దార్ కార్యాలయ భవనం

నల్లమాడ: స్థానిక తహసీల్దార్ కార్యాలయ పక్కా భవనం పెచ్చులూడి మీద పడుతోందని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రెండేళ్ల క్రితం అధికారులు ఖాళీ చేశారు. సుమారు కిలో మీటర్ దూరంలోని కుటాలపల్లి రోడ్డు పక్కన ఉన్న ఎస్సీ వసతిగృహ భవనంలోకి తహసీల్దార్ కార్యాలయాన్ని మార్పుచేసి రెవెన్యూ అధికారులు అక్కడే విధులు నిర్వహిస్తున్నారు. దీంతో పనుల నిమిత్తం తహసీల్దార్ కార్యాలయానికి వచ్చే గ్రామీణ ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. మరోప్రక్క ఆలనాపాలన లేక తహసీల్దార్ కార్యాలయ పక్కా భవనం మద్యం ప్రియులకు నిలయంగా మారి, పందుల సంచారంతో మరింత శిథిలావస్థకు చేరుకుంటోంది.

ప్రజలకు తప్పని అవస్థలు

తహసీల్దార్ కార్యాలయం దాదాపు కిలో మీటరు దూరంలో ఉండటంతో పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చే గ్రామీణులు రాకపోకలకు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. 1997లో తహసీల్దార్, మండల పరిషత్ కార్యాలయాలను ఒకే ప్రాంగణంలో నిర్మించారు. అదే ప్రాంగణంలో వ్యవసాయ శాఖ, ఎంఈఓ, హౌసింగ్, వెలుగు కార్యాలయాలు, రెండు సచివాలయ భవనాలతో పాటు వ్యవసాయ గోదాము ఉన్నాయి. ప్రభుత్వ కార్యాలయాల ప్రహరీకి ఆనుకొనే ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు ఉండటంతో వివిధ పనుల నిమిత్తం కార్యాలయాలకు వచ్చే ప్రజలకు దాదాపుగా అన్ని సేవలు ఒకేచోట అందుబాటులో ఉండేవి. ప్రస్తుతం తహసీల్దార్ కార్యాలయాన్ని దూరంగా తరలించడంతో ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ద్విచక్ర వాహనాలు, ఆటోలను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొంది. వృద్ధులు, వికలాంగులు ఆటోల్లో రాకపోకలు సాగిస్తూ వ్యయప్రయాసలకు గురవుతున్నారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద కనీసం తాగడానికి మంచినీరు, టీ కూడా దొరక్కపోవడంతో ప్రజలే గాక కార్యాలయ సిబ్బంది సైతం అవస్థలు పడుతున్నారు.


భవనం మరమ్మతుకు చర్యలు తీసుకోవాలి



తహసీల్దార్ కార్యాలయ భవనం మరమ్మతుకు అధికారులు చర్యలు తీసుకోవాలి. కార్యాలయాన్ని గ్రామానికి దూరంగా ఏర్పాటు చేయడంతో నల్లమాడ, పెమనకుంటపల్లి తండా పంచాయతీల ప్రజలు తప్ప తక్కిన 12 పంచాయితీల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను గుర్తించి సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు కార్యాలయ పక్కా భవనాన్ని ప్రజలకు అందుబాటులోకి తేవాలి.

–ప్రతాప్‌రెడ్డి, మాజీ సర్పంచ్, చారుపల్లి

కార్యాలయానికి వెళ్లాలంటే అవస్థలు



తహసీల్దార్ కార్యాలయాన్ని మండల కేంద్రానికి దూరంగా ఓ వైపున ఏర్పాటు చేయడంతో ఏదేని పనిమీద కార్యాలయానికి వెళ్లాలంటే ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. వృద్ధులు, వికలాంగులు, విద్యార్థుల పరిస్థితి చెప్పనవసరం లేదు. ఆటోలను ఆశ్రయించి వ్యయప్రయాసలకు గురికావాల్సి వస్తోంది. అక్కడ తాగడానికి మంచినీరు, టీ కూడా దొరక్కపోవడంతో ఆకలిదప్పులతో ప్రజలు అలమటించాల్సి వస్తోంది.

–నాగరాజునాయుడు, దొన్నికోట